www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:60 SATURDAY , JULY 11,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 60 శనివారం 11 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-

# 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు: సీఎం రేవంత్



- 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం
- అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
- పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ

జులై 10 హంసకలం వార్త

2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని, నియోజక వర్గాల పునర్విభజన అనంతరం 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని అన్నారు. 182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. -మిగతా2లో

# హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం



- పదేళ్లు అధికారంలో ఉన్న హరీశ్ రావు కుంగిపోయే ప్రాజెక్టులు కట్టారన్న మహేశ్ గౌడ్
- ఇప్పుడు ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ఈటల బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా ఉందని ఎద్దేవా

# స్పెయిన్‌లో కార్చిచ్చు.. 11 మంది మృతి, 19 మంది గల్లంతు.. వందలాది మంది నిరాశ్రయులు!

జులై 10 హంసకలం వార్త

దక్షిణ స్పెయిన్‌లోని అండలూసియా రీజియన్‌ను భారీ కార్చిచ్చు కాల్చి బూడిద చేస్తోంది. ఈ ఘోర ప్రమాదంలో ఇప్పటివరకు 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 19 మంది గల్లంతయ్యారు. మంటలు ఉధృతంగా వ్యాపించడంతో సుమారు 600 మంది నివాసితులు నిరాశ్రయులయ్యారు. ప్రతికూల గాలుల మధ్య అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. - మిగతా2లో



# ఆసీస్ క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ప్రధాని మోదీ అరుదైన కానుక.. 20 ఏళ్ల నాటి జ్ఞాపకం

జులై 10 హంసకలం వార్త

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఆస్ట్రేలియా పర్యటనలో ఆ దేశ క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ఓ అరుదైన కానుకను అందజేసి ఆశ్చర్యపరిచారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తామిద్దరూ తొలిసారి కలుసుకున్నప్పటి మధుర స్మృతిని గుర్తు చేస్తూ, ఆ ఫొటోను ఫ్రేమ్ చేయించి శుక్రవారం ఆయనకు బహూకరించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ - మిగతా2లో



# టీడీపీ ఎన్నారై జాతీయ కమిటీని నియమించిన చంద్రబాబు..



- టీడీపీ ఎన్నారై సెంట్రల్ కమిటీని ప్రకటించిన పార్టీ అధిష్ఠానం
- అధ్యక్షుడిగా గురురాజా నియామకం
- చంద్రబాబు ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు
- ప్రధాన కార్యదర్శులుగా ముగ్గురికి బాధ్యతలు
- మొత్తం 45 మందితో నూతన కార్యవర్గం

# పేదల ఆరోగ్యంతో ఆడుకుంటే ఊరుకోం: చల్లూరు పీహెచ్‌సీ తనిఖీల్లో కౌశిక్ రెడ్డి హెచ్చరిక

జులై 10 హంసకలం వార్త

ప్రభుత్వ వైద్యం పై ఆధారపడే పేద ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. వీణవంక మండలం చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు లేవని, సిబ్బంది కొరతతో వైద్యం అందడం లేదని స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చియని ఆయన తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి ఈరోజు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కౌశిక్ రెడ్డి... - మిగతా2లో



# పుంగనూరులో ఈవీ క్లస్టర్.. ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్

జులై 10 హంసకలం వార్త

ఆంధ్రప్రదేశ్‌ను ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రంగంలో దేశానికే హబ్‌గా మార్చేందుకు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకెళుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన "సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0" కింద రాష్ట్రంలో విస్తృతమైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని కొరియన్ సంస్థలను ఆయన ఆహ్వానించారు.



## 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు: సీఎం రేవంత్

182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాము ముందే చెప్పి చేసి చూపించామని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్రస్థాయి లో విరుచుకుపడ్డారు. "కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్ లో బంధించాం. కాచుకో చంద్రశేఖర్ రావు.. జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనివ్వబోమని ప్రజలు సంకల్పించారని, పదేళ్ల రాక్షస పాలనకు ఇప్పటికే ముగింపు పలికారన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఉంటారో లేదో హరీశ్ రావే చెప్పాలి అన్నారు. బీజేపీతో మంతనాలు జరపడం లేదా అని ప్రశ్నించారు. రైతు ఆశీర్వాద సభలో భాగంగా 1.44 లక్షల మంది రైతులకు రూ.1,009 కోట్ల రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లను ప్రారంభించాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. అలా చేస్తే భద్రాచలం రామాలయం సహా 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని పేర్కొన్న రేవంత్.. "ఇప్పుడు వైర్లు పట్టుకుంటే కాలి బూడిదైపోతారు" అని వ్యాఖ్యానించారు.

## ఆసీస్ క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ప్రధాని మోదీ అరుదైన కానుక.. 20 ఏళ్ల నాటి జ్ఞాపకం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఆస్ట్రేలియా పర్యటనలో ఆ దేశ క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ఓ అరుదైన కానుకను అందజేసి ఆశ్చర్యపరిచారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తామిద్దరూ తొలిసారి కలుసుకున్నప్పటి మధుర స్మృతిని గుర్తు చేస్తూ, ఆ ఫొటోను ఫ్రేమ్ చేయించి శుక్రవారం ఆయనకు బహూకరించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)ను సందర్శించిన సందర్భంగా ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్టీవ్ వా ఆయనతో భేటీ అయ్యారు. ఆనాటి స్మృతులను నెమరువేసుకుంటూ ప్రధాని మోదీ అందించిన ఈ వ్యక్తిగత బహుమతికి స్టీవ్ వా మంత్రముగ్ధులయ్యారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు యువ క్రీడాకారులతో సంభాషించారు. క్రికెట్, కబడ్డీ, ఆస్ట్రేలియన్ ఫుట్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్న అథ్లెట్లను వారు ఉత్సాహపరిచారు. ఇదే వేదికపై 'భారత్-ఆస్ట్రేలియా క్రీడా సహకార రోడ్‌మ్యాప్'ను కూడా ఆవిష్కరించారు. ఈ పర్యటన సందర్భంగా క్రికెట్ ప్రేమికులకు మరో తీపి కబురు అందింది. 2026-27 బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) సీజన్ ప్రారంభ మ్యాచ్‌ను చెన్నైలోని ఎం.ఏ.చిదంబరం స్టేడియం లో నిర్వహించనున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా అధికారికంగా ప్రకటించింది. డిసెంబర్ 12న మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్ల మధ్య ఈ పోరు సాగనుంది. ఆస్ట్రేలియా గడ్డ వెలుపల బీబీఎల్ మ్యాచ్ నిర్వహించడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు: ఈటల

ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి నీరు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల ఆరోపించారు. వర్షాకాలంలోనూ సాగునీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద బోర్లు, బావులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని చెప్పారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసమే జరిగిందని ఈటల గుర్తుచేశారు. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనా మూలాలను మరచిపోవద్దన్నారు. కాళేశ్వరం కంటే ముందే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా ప్రాణహిత జలాలను తీసుకురావాలనే ప్రణాళిక రూపొందిందని, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులకు అప్పుడే శ్రీకారం చుట్టారని వివరించారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఎల్లంపల్లికి నీటిని తరలించే వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్న 29 టీఎంసీల నీరు కూడా ఆ ప్రాజెక్టుల ద్వారానే వచ్చిందన్నారు. కాళేశ్వరం వల్లే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు పంటలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, డిజైన్ మార్పులపై తాను మాట్లాడడం లేదని, కానీ మొత్తం ప్రాజెక్టునే తప్పుపట్టడం సరికాదని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రాష్ట్రం తీవ్ర కరవును ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రతిపక్షాలపై విమర్శల జడివాన కురిపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి కుంగిపోయే ప్రాజెక్టులు కట్టిన మీరు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని మహేశ్ గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి చూసి ఆయనకు మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయన్నారు. హరీశ్ రావు ఒకవేళ కాంగ్రెస్‌లోకి వస్తానంటే... తమ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో (పీఏసీ) చర్చించి నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని నిలదీశారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉండి నీళ్ల దోపిడీని ప్రశ్నించని ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్... ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా కనిపిస్తోందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అందరికీ ఒకటేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. కడియం శ్రీహరి, కొండా సురేఖ వివాదాలపై సచిన్ సావంత్, జగ్గారెడ్డిలతో కూడిన కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రతినిధులతో చర్చించి ఈ నెల 15న కొలిక్కి తెస్తామని కీలక అప్‌డేట్ ఇచ్చారు.

## స్పెయిన్‌లో కార్చిచ్చు.. 11 మంది మృతి, 19 మంది గల్లంతు.. వందలాది మంది నిరాశ్రయులు!

అండలూసియా ప్రాంతీయ ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం, అల్మేరియా ప్రావిన్స్‌లోని లాస్ గల్లార్డోస్, బెడార్, అంటాస్ మునిసిపాలిటీలపై ఈ కార్చిచ్చు తీవ్ర ప్రభావం చూపింది. తొలుత మరణాల సంఖ్య 12 గా ప్రకటించినప్పటికీ, అధికారులు దానిని 11 గా సవరించారు.

**శరణాలయాల్లో బాధితులు:**

దాదాపు 600 మంది ఇళ్లను వదిలి వెళ్లగా, రాత్రికి రాత్రే 120 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అల్మోక్రైజర్, ప్యూయెంటె డెల్ అల్బారికో, లాస్ పినోస్, లా సెరెనా, పినార్ వంటి పరిసర ప్రాంతాల నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. శరణార్థులుగా మారిన వారిలో 74 మందికి ఒబ్రిన్ థియేటర్‌లో, మరో 74 మందికి గరుచా థియేటర్‌లో అధికారులు తాత్కాలిక వసతి కల్పించారు.

**3,150 హెక్టార్లు బూడిద.. హై అలర్ట్‌లో అధికారులు**

ఈ భీకర కార్చిచ్చు కారణంగా ఇప్పటివరకు దాదాపు 3,150 హెక్టార్ల అటవీ భూమి పూర్తిగా అగ్నికి ఆహుతైపోయింది. ప్రస్తుతం మంటల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల సహాయక చర్యలు, మంటల్ని అదుపు చేయడం కష్టతరంగా మారిందని అండలూసియా అత్యవసర సేవల మంత్రి ఆంటోనియో సాంజ్ కాబెల్లో తెలిపారు. అంతేకాదు, గాలుల దిశ మారే అవకాశం ఉన్నందున అధికారులు ఇప్పటికీ హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా అక్కడ 'ప్లాన్ ఇన్ఫోకా' అత్యవసర ప్రణాళికను అమలు చేస్తున్నారు.

**తీవ్రంగా గాయపడిన బాధితులు**

ఈ ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడగా, వారిలో నలుగురు పొగ పీల్చడం వల్ల తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు, తీవ్రమైన కాలిన గాయాలకు గురయ్యారు. వీరిని మెరుగైన చికిత్స కోసం సెవిల్లెలోని 'విర్జెన్ డెల్ రోసియో' ఆసుపత్రికి తరలించారు. మరో నలుగురికి ఘటనా స్థలంలోనే ప్రాథమిక చికిత్స అందించారు. అధికారులు జారీ చేసే భద్రతా ఆదేశాలను, తరలింపు సూచనలను ప్రజలందరూ కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం చేయకుండా ప్రాణాలు కాపాడుకోవాలని అత్యవసర సేవల విభాగం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## పేదల ఆరోగ్యంతో ఆడుకుంటే ఊరుకోం: చల్లూరు పీహెచ్‌సీ తనిఖీల్లో కౌశిక్ రెడ్డి హెచ్చరిక

ప్రభుత్వ వైద్యం పై ఆధారపడే పేద ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. వీణవంక మండలం చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు లేవని, సిబ్బంది కొరతతో వైద్యం అందడం లేదని స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి ఈరోజు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కౌశిక్ రెడ్డి... ఆసుపత్రిలోని ఓపీ రిజిస్టర్, మందుల కౌంటర్, ల్యాబ్‌లను స్వయంగా పరిశీలించి, అక్కడ అందుతున్న సేవలపై వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకప్పుడు ప్రసవాల విభాగంలో విశేష ప్రతిభ కనబరిచి, ఏకంగా మూడు సార్లు ప్రతిష్మాత్మక అవార్డులు సాధించిన చల్లూరు పీహెచ్‌సీ... నేడు అధికారుల నిర్లక్ష్యం వల్ల అధ్వాన్నంగా తయారయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రికి మొత్తం 12 మంది సిబ్బంది మంజూరై ఉన్నప్పటికీ, అందులో సగం మంది డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ కేవలం ఒక్క డాక్టర్, అరకొర సిబ్బందితో నెట్టుకురావడం వల్ల పేదలకు పూర్తిస్థాయి వైద్యం అందడం లేదన్నారు. ఆసుపత్రి నుంచే జిల్లా వైద్యాధికారి వెంకటరమణతో కౌశిక్ రెడ్డి ఫోన్ లో మాట్లాడారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన సిబ్బందిని తక్షణమే వెనక్కి రప్పించి, చల్లూరు పీహెచ్‌సీలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. వచ్చే వారం రోజుల్లో తాను మళ్లీ ఈ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శిస్తానని... ఆలోగా ఆసుపత్రి నిర్వహణ, సిబ్బంది హాజరు, పరిశుభ్రతతో పాటు రోగులకు అందించే వైద్య సేవల్లో స్పష్టమైన మార్పు రావాలని అధికారులకు గడువు విధించారు. విధుల్లో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నేతలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## టీడీపీ ఎన్నారై జాతీయ కమిటీని నియమించిన చంద్రబాబు..

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తమ ఎన్ఆర్ఐ విభాగాన్ని బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు, టీడీపీ ఎన్ఆర్ఐ జాతీయ కమిటీని నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడంతో పాటు, ప్రవాసాంధ్రులను పార్టీకి మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. 44 మంది సభ్యులతో కూడిన ఈ భారీ కమిటీకి నూతన అధ్యక్షుడిగా పి. గురురాజాను నియమించారు. పార్టీలో కీలకమైన ప్రధాన కార్యదర్శుల బాధ్యతలను ముగ్గురికి అప్పగించారు. జి. గంగాధర్, ముక్కు తులసి కుమార్, చలసాని కిశోర్ ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించనున్నారు. వీరితో పాటు ఐదుగురిని ఉపాధ్యక్షులుగా నియమించారు. వారిలో ఇంద్రసేన నాయుడు మద్దిబాట్ల, కోమటి జయరాం, రషీదా బేగం, సురేష్ పుట్టగుంట, శ్యామ్ కొడూరి ఉన్నారు.

**కమిటీలోని ఇతర సభ్యులు, వారి పదవుల పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి:**

ఆర్గనైజింగ్ సెక్రటరీలు: విజేత జవ్వాది, బాలసుబ్రహ్మణ్యం అన్నమేటి, విజయ్ అడుసుమిల్లి, శివ నాగరాజు నక్కల, కౌతారపు లావణ్య, మాధవి ముప్పవరపు, రాజా రవికిరణ్ కోడి, సైఫుల్లా ఖలీద్, రాచూరి మోహన్, అల్లా వెంకట్, చావా పద్మ, వేణుగోపాల్ రెడ్డి, యష్ బొద్దులూరి, హేమ కోసూరు, విజయ్ చెన్నుపాటి. కార్యదర్శులు: శ్రీనివాస్ గోగినేని, రాజేష్ పల్లేటి, నాగరాజు జడ, పింకీ పొనుగోటి, పేరూరు రామకృష్ణ, గాలి దుర్గాభవాని, వంకా వెంకటరమణమ్మ, కృష్ణ ప్రియ అడుసుమిల్లి, సూర్య బెజవాడ, తరణిధర్ పరుచూరి, సుభాష్ రావడ, జోగి నాయుడు, వెంకట రమణ, గోపి నంబళ్ల, కవిత పరుచూరి, అనిల్ కుమార్ నున్నా,నర్మద జొన్నగడ్డ. ఇతర ముఖ్య బాధ్యతలు: సోషల్ మీడియా విభాగం బాధ్యతలను స్వాతి రెడ్డి, సాయి బొల్లినేనికి అప్పగించారు. కమిటీ కోశాధికారి (ట్రెజరర్)గా శ్రీనివాస్ అబ్బూరిని నియమించారు. ఈ నూతన కమిటీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ మద్దతుదారులను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# పుంగనూరులో ఈవీ క్లస్టర్.. ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్

ఆంధ్రప్రదేశ్‌ను ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రంగంలో దేశానికే హబ్‌గా మార్చేందుకు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకెళుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన "సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0" కింద రాష్ట్రంలో విస్తృతమైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని కొరియన్ సంస్థలను ఆయన ఆహ్వానించారు. దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్, సియోల్‌లో కొరియా ఆటో ఇండస్ట్రీస్ కోఆపరేషన్ ఏజెన్సీ (కేఏఐసీఏ) ఛైర్మన్ టేక్-సుంగ్ లీ నేతృత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈవీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈవీ ఎకోసిస్టమ్‌లో భాగంగా పూర్తిస్థాయిలో ఏపీఎస్ఆర్టీసీ బస్సులను విద్యుదీకరించడం, గ్రీన్ కారిడార్లలో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం, పుంగనూరులో ప్రత్యేక ఈవీ క్లస్టర్‌ను నెలకొల్పడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధికి, ఈవీ పరిశోధనలకు ప్రత్యేక గ్రాంట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా, ఈవీ బ్యాటరీలు, మాగ్నెట్‌ల తయారీకి అవసరమైన ముడిసరుకుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో ఒక 'రేర్ ఎర్త్ కారిడార్' ఏర్పాటు చేయబోతున్నట్లు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే బలమైన ఆటోమోటివ్ పరిశ్రమ ఉందని, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో సుమారు 100 కిలోమీటర్ల మేర ఆటోమోటివ్ విడిభాగాల ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. కియా మోటార్స్‌తో పాటు అశోక్ లేలాండ్, ఇసుజు, హీరో మోటోకార్ప్, అమర్ రాజా, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ వంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయని గుర్తుచేశారు. అశోక్ లేలాండ్ సంస్థ సుమారు రూ. 2,500 కోట్ల పెట్టుబడితో లిథియం అయాన్ ఈ-బస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. "అనంతపురంలో కియా మోటార్స్ సాధించిన అద్భుత విజయమే మా ప్రభుత్వ నిబద్ధతకు, సామర్థ్యానికి నిదర్శనం" అని లోకేశ్ అన్నారు. కొరియా కంపెనీల కోసం ప్రత్యేకంగా రెండు ఆటో కాంపోనెంట్స్ పార్కులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కియా క్లస్టర్ సమీపంలో ఒకటి, శ్రీసిటీ-చిత్తూరు-తిరుపతి కారిడార్‌లో మరొకటి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పార్కులలో ప్లగ్-అండ్-ప్లే షెడ్లు, ఉమ్మడి టెస్టింగ్ సౌకర్యాలు, పూర్తిస్థాయి సపోర్ట్ కోసం ఒక 'కొరియా డెస్క్' కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ఏపీఎస్ఎస్‌డీసీ, కౌశలం ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈవీ పవర్‌ట్రెయిన్‌ల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు ఒక అకాడమీని ఏర్పాటు చేయాలని, ఇందుకు రాష్ట్రంలోని 250కి పైగా ఇంజనీరింగ్ కళాశాలల సహకారం తీసుకోవాలని కొరియన్ సంస్థలను కోరారు.


# సంపాదకీయం


## ‘సర్’పై ఎందుకా వ్యతిరేకత?

1990ల??లో ఎన్నికల వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన టి.ఎన్.శేషన్‌పై రాజకీయ పార్టీలు దుమ్మెత్తి పోశాయి. ఓటరు గుర్తింపు కార్డుపై ఫొటో తప్పనిసరిగా ఉండాలనే నిబంధన రాజకీయ పార్టీలకు ఆగ్రహం తెప్పించింది. ముఖ్యంగా బిహార్, యూపీ వంటి రాష్ట్రాల్లో ఈ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకతను బాహాటంగానే వెలిబుచ్చారు. బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్, దొంగ ఓట్లపై ఆధారపడిన పార్టీలకు, నేతలకు శేషన్ ప్రవేశపెట్టిన ఎన్నికల సంస్కరణలు మింగుడుపడలేదు. ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషన్ ‘సర్’ పేరిట ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అవసరమని భావించింది. మరణించిన, దేశం వదిలి వెళ్లిపోయిన ఓటర్లను, రాష్ట్రాలు మారిన, ఇతర దేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన వారి ఓట్లను తొలగించడంతో పాటు రీ--మ్యాపింగ్ చేయాలని నిర్ణయించింది. సరిహద్దుల్లోని ఈశాన్య రాష్ట్రాలతో పాటు పశ్చిమ బెంగాల్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో అక్రమ వలసదారుల జనాభా అతివేగంగా పెరుగుతోంది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవారు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి భారతదేశంలో నివసిస్తున్నారు. ఇది క్రమంగా జనాభా నిష్పత్తిలో మార్పుగా పరిణమిస్తోంది. దీంతో ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాను సవరించాలని నిర్ణయించింది. ఇప్పటికే 16 రాష్ట్రాల్లో ‘సర్’ ప్రక్రియ పూర్తయింది. మిగతా రాష్ట్రాల్లో ప్రస్తుతం కొనసాగుతోంది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ ప్రక్రియను చేపట్టడం ఇది తొలిసారి కాదు. 1952 నుంచి 2004 వరకు 13 సార్లు సమగ్ర ప్రత్యేక సర్వేలు జరిగాయి. చివరగా మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో 2004--05లో దేశవ్యాప్తంగా ‘సర్’ ప్రక్రియ జరిగింది. అయితే ప్రాంతీయ పార్టీల మద్దతుతో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వానికి వాటి మాట వినాల్సి వచ్చింది. దీంతో కొన్ని రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ తూతూ మంత్రంగా జరిగింది. ప్రస్తుతం, ‘సర్’ ప్రక్రియ శాస్త్రీయ సవరణ కాదని, రాజకీయ సమీకరణ అంటూ వస్తున్న విమర్శలను పరిశీలిస్తే... దెబ్బతింటున్న ప్రాంతీయ పార్టీల ప్రయోజనాలు అర్థమవుతాయి. ఎన్నికల సంఘం సర్ ప్రక్రియలో ఈసారి కేవలం భౌతిక తనిఖీలపైనే ఆధారపడకుండా, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఓటర్ల జాబితాను స్కాన్ చేస్తోంది. దీనికోసం కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన DSEs-- Demographically Similar Entries, PSEs-- Photo Similar Entries, DDS-- De--Duplication Softwarవలను ఎన్నికల కమిషన్ వినియోగిస్తోంది. అంటే ఒకే పేరు, తండ్రి లేదా భర్త పేరు, ఒకే వయస్సు ఉన్న ఓటర్లను ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా వేర్వేరు నియోజకవర్గాల్లో లేదా ఒకే నియోజకవర్గంలో వేర్వేరు బూత్‌లలో ఉన్న ఒకే వ్యక్తి ఫొటోలను ఐడెంటిఫై చేస్తుంది. రేషన్ కార్డు లేదా సివిల్ సప్లైస్ డేటాబేస్‌లతో క్రాస్--వెరిఫి కేషన్ చేయడం వల్ల పారదర్శకత ఉంటుంది. తమిళనాడులో ‘ఘోస్ట్ ఓటర్ల’ను భారీగా తొలగించారు. సవరణకు ముందు ఓటర్ల సంఖ్య 6.41 కోట్లు. సవరణ తర్వాత 5.67 కోట్లు. వలసల కారణంగా పాత నియోజకవర్గాల్లో ఓట్లు అలాగే ఉండిపోతే పీఎస్ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా దాదాపు 74 లక్షల ఓట్లను తొలగించారు. తొలగించిన తర్వాత అర్హులైన ఓటర్లు సరైన పత్రాలు సమర్పించి తమ ఓటు హక్కును పునరుద్ధరించుకున్నారు. ప్రసార మాధ్యమాల్లో కేవలం తొలగింపునకు సంబంధించిన గణాంకాలు మాత్రమే రావడంతో అనవసరమైన ఆందోళన, గందరగోళం నెలకొన్నాయి. కొన్ని రాజకీయ పార్టీలు ‘సర్’ వల్ల పౌరసత్వమే ప్రమాదంలో పడుతోందనే భయాలను ప్రచారం చేస్తున్నాయి. సర్‌లో నమోదు కాకపోయినా తర్వాత దరఖాస్తు చేసుకుని ఓటర్ల జాబితాలో పేరు చేర్పించుకోవచ్చు. బీఎల్‌వోలు, ఎన్నికల అధికారులు దరఖాస్తు పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారించిన తర్వాత దరఖాస్తుదారుడి పేరును ఓటర్ల జాబితాలో చేరుస్తారు. దేశవ్యాప్తంగా 4,123 శాసనసభ నియోజకవర్గాలుంటే అందులో దాదాపు 870 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొన్ని కోట్ల నకిలీ ఓట్లు, అక్రమ ఓట్లు, వలసదారుల ఓట్లు ఉన్నట్టు అంచనా. మృతిచెందిన వారిని మినహాయిస్తేనే ఈ స్థాయిలో నకిలీ, అక్రమ ఓట్లు ఉన్నాయంటే... ఎన్నికల జయాపజయాలను ఆ ఓటర్లే నిర్ణయిస్తున్నారని అర్థమవుతోంది. ‘సర్’ ప్రక్రియలో ముస్లిం ఓటర్లే లక్ష్యమంటూ కొన్ని పార్టీలు మరో అబద్ధపు ప్రచారం చేస్తున్నాయి. నిజానికి పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ‘సర్’ ప్రక్రియలో 63శాతం హిందువుల ఓట్లు తొలగిస్తే, కేవలం 34శాతం ముస్లిం ఓట్లను తొలగించారు. అన్ని రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. ‘సర్’ ప్రక్రియ లక్ష్యం హిందువు--ముస్లిం--క్రిస్టియన్ కాదు. దేశంలో నికరంగా ఎన్ని అసలైన ఓట్లున్నాయో తేల్చడం. తెలంగాణలో ప్రస్తుతం ‘సర్’ ప్రక్రియ కొనసాగుతున్నందున, హైదరాబాద్ పాతబస్తీలో కొన్ని లక్షల ఓట్లు డిలీట్ అవుతాయనే ప్రచారం చేస్తున్నారు. ఇది సహేతుకం కాదు. సరైన పత్రాలు ఎవరు చూపితే వారు ఓటర్లుగా ఉంటారు. ఏ మతంవారు సరైన పత్రాలు చూపకపోయినా సహజంగానే వారి ఓట్లు జాబితా నుంచి డిలీట్ అవుతాయి. ఇందులో మళ్లీ మెజారిటీ ఓటర్లు తిరిగి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చు. అందుకే రాజకీయ పార్టీల అబద్ధపు ప్రచారాలను పట్టించుకోకుండా ప్రజలు తాము స్వతహాగా ‘సర్’పై అవగాహన పెంచుకోవడం తప్పనిసరి.

# ‘సంఘ్’లో ఆ ధర్మాగ్రహం ఏదీ?






సంఘ్ పరివార్ అగ్ర నాయకుడు ఒకరితో నా మొట్టమొదటి ముఖాముఖీ సంభాషణ 1989లో జరిగింది. దివంగత అశోక్ సింఘాల్ (నాడు విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు) పాల్గొంటున్న విలేఖర్ల సమావేశానికి నన్ను పంపించారు. రామ జన్మభూమి ఉద్యమం దేశాన్ని ఊపేస్తున్న రోజులవి. రామశిల పూజా కార్యక్రమం ద్వారా రామ భక్తులను వీహెచ్‌పీ సంఘటితం చేస్తోంది. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ‘పవిత్ర’ ఇటుకలు, విరాళాలు ఇవ్వాలని దేశ ప్రజలకు వీహెచ్‌పీ ప్రభావశీలంగా విజ్ఞప్తి చేసింది. అయోధ్యలో ఆలయ నిర్మాణానికై ప్రజల నుంచి సేకరిస్తున్న విరాళాలకు లెక్కలు సరిగ్గా నిర్వహిస్తున్నారా? అని ఆ పత్రికా గోష్ఠిలో సింఘాల్‌ను ప్రశ్నించాను. నా ప్రశ్నకు ఆయన వెన్వెంటనే తీవ్రంగా ప్రతిస్పందించారు. ‘ఇదేమి ప్రశ్న’ అని ఆయన తీక్షణ స్వరంతో నన్ను తిరిగి ప్రశ్నించారు. ‘కోట్లాది హిందువుల మనోభావాలతో మేము ఆటలాడుతున్నామని మీరు భావిస్తున్నారా?’ అని సింఘాల్ అన్నారు. ఆయన మాటల్లో ఆగ్రహమే కాదు, మనస్తాపమూ ధ్వనించింది. మత విశ్వాసాలను అడ్డుపెట్టుకుని తాము ఎటువంటి తప్పూ చేయబోమని, హిందువుల శ్రీరామ భక్తిని తాము నిష్కామంగా గౌరవిస్తామన్న భావోద్ధృతి సింఘాల్ ప్రతిస్పందనలో ఉన్నది. ఈ కారణంగానే ఇంచుమించు నాలుగు దశాబ్దాలుగా ఆ మాటామంతీ నా మనసులో నిలిచిపోయింది. 1989లో ఏ ప్రశ్న అయితే సింఘాల్ ధర్మాగ్రహానికి కారణమయిందో ఇప్పుడు అదే ప్రశ్నను రామాలయ సంరక్షకులకు సంధిస్తున్నారు. అపారంగా వచ్చిన విరాళాలకు సరైన లెక్కలు చూపుతారా? వాటి వినియోగంపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉన్నదా? కోట్లాది భక్తుల విశ్వాసం, విరాళాల ఆలంబనతో నిర్మాణమైన ఆలయంలో నిధుల చోరీ, దుర్వినియోగం ఎలా జరిగింది? ఈ ప్రశ్నాస్త్రాలకు గురవుతున్న వ్యక్తి శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్. విరాళాల బాగోతం రచ్చకెక్కడంతో ఆ బాధ్యతల నుంచి వైదొలగాల్సిన అగత్యం ఆయనకు ఏర్పడింది. అశోక్ సింఘాల్ సన్నిహిత సహచరుడు అయిన చంపత్‌రాయ్ జీవితం వీహెచ్‌పీతో ముడివడి ఉంది. రామ్ మందిర్ ఉద్యమానికి అంకితమైన వ్యక్తిగా ప్రజల నుంచి గౌరవాదరాలు పొందుతున్న సదాచారి ఆయన. రాయ్ వ్యక్తిగతంగా నిరాడంబరుడు, నిజాయితీపరుడు అని ఆయనతో పరిచయమున్నవారందరూ చెబుతారు. అయితే వ్యక్తిగత సత్ప్రవర్తన సంస్థాగత సామర్థ్యానికి ప్రత్యామ్నాయం కాదు. భారీ నిధులను సక్రమంగా నిర్వహించేందుకు వ్యక్తిగత నిజాయితీ మాత్రమే సరిపోదు. ప్రజలు సమకూర్చిన నిధులు సురక్షితంగా సద్వినియోగమవ్వాలంటే వాటి లెక్కలు సక్రమంగా ఉండాలి. వాటి నిర్వహణ వృత్తి నైపుణ్యాలతో జరగాలి, మరీ ముఖ్యంగా ఆ నిధులపై కఠినమైన పర్యవేక్షణ ఉండితీరాలి. వీటిలో ఏ మాత్రం లోటుపాట్లు ఉన్నా పర్యవసానాలు కేవలం పాలనా పరమైన పొరపాట్లకే పరిమితం కాకుండా నేరపూరిత నిర్లక్ష్యంగా పరిణమిస్తాయి. కోట్లాది భక్తుల నమ్మకాలకు ద్రోహం చేయటం కిందకు వస్తాయి. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ప్రజలు ఇచ్చిన వందల కోట్ల రూపాయల నిధులు ఆలయ ప్రాంగణంలోనే తస్కరణకు గురికావడం భక్తులకు నమ్మక ద్రోహం చేయడమే కాదూ? ఇదిగో ఈ కారణంగానే అయోధ్య అవినీతి సంఘ్ పరివార్‌కు ఒక కళంకమయింది. భారతదేశ ప్రజా జీవితంలో ఒక గొప్ప ప్రభావశక్తిగా ఎదిగిన అనంతరం సంఘ్ పరివార్, బహుశా ప్రప్రథమంగా ఎదుర్కొంటున్న కీర్తిప్రతిష్ఠల సంక్షోభమిది. దశాబ్దాలుగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తనకొక విలక్షణ కీర్తిని పెంపొందించుకుంటూ వస్తోంది. సంప్రదాయ రాజకీయాలకు భిన్నమైన కార్యాచరణ ఉన్న సంస్థ తమది అని సంఘీయులు సగర్వంగా చెప్పుకోవడం కద్దు. క్రమశిక్షణ, సేవ, జాతి నిర్మాణానికి అంకితమైన సాంస్కృతిక ఉద్యమం తమది అని వారు చెప్పుకుంటారు. ధర్మరక్షణకు అంకితమైన సంస్థ తమది అని, జాతి విశాల ప్రయోజనాలకు నిస్వార్థంగా పనిచేసేందుకు సుశిక్షితులైనవారే తమ కార్యకర్తలు అని సంఘ్ చెబుతుంది. సంఘ్ చెప్పుకుంటున్న ఈ నైతిక ఆధిక్యతే ఇప్పుడు క్లిష్ట పరీక్ష నెదుర్కొంటున్నది. అయోధ్య ఆలయంలో నిధుల చోరీని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలె సరిగానే ఖండించారు. ఆ అక్రమానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. హిందూ సమాజాన్ని అపఖ్యాతిపాలు చేసేందుకై అయోధ్య ఉదంతాన్ని ఉపయోగించుకోవడానికి ‘హిందూ--వ్యతిరేక’, ‘జాతి--వ్యతిరేక’ శక్తులు కుట్రలు పన్నుతున్నాయని కూడా ఆయన అదే సమయంలో హెచ్చరించారు. ఇది విన్న వెంటనే ఒక ప్రశ్న అడగడం తప్పనిసరి: ‘కుట్రలా? అవి ఎక్కడ జరుగుతున్నాయి హోసబాలె గారూ?’ అశేష భక్తులు అపారంగా ఇచ్చిన నిధుల అపహరణ, దుర్వినియోగాన్ని బహిర్గతం చేయడం హిందూధర్మంపై దాడి ఎలా అవుతుంది? హిందూ ధర్మ పుణ్య పురుషుడి ఆలయ పవిత్రతను కాపాడేందుకే ఆ అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించడం జరుగుతోంది. బాధ్యతాయుతమైన పదవులలో ఉన్నవారికి ఇబ్బందులు సృష్టించిన కారణంగా జవాబుదారీతనం హిందూ ధర్మ వ్యతిరేకత అయిపోదు. రామ్ మందిర్ ఉద్యమ లక్ష్య పరిపూర్తి అయినవేళ దానికి నైతిక మార్గదర్శకత్వం వహించినట్టు చెప్పుకున్న ఆరెస్సెస్, ఇప్పుడు ఆ ఉద్యమం సంక్షోభంలో పడిన సమయంలో అందుకు కారణమైన సంస్థాగత వైఫల్యాల బాధ్యత నుంచి దూరం జరగడం సబబేనా? ఈ ప్రశ్న ఎందుకంటే రామ జన్మభూమి ఉద్యమం కేవలం మరో రాజకీయ ఉద్యమం కాదు. అది సంఘ్ పరివార్ భావజాల కార్యాచరణ. ఆ భావజాలానికి అనుగుణంగా భారత్‌ను రూపొందించడమే దాని లక్ష్యం. వీహెచ్‌పీ ఆ లక్ష్యానికి మద్దతుగా ప్రజలను సమీకరించింది. భారతీయ జనతా పార్టీ మున్నెన్నడూ లేని రీతిలో ఆ ఉద్యమ ఆలంబనతో ఎన్నికలలో విజయాలను సాధించింది. పరాకాష్ఠగా దేశ పాలనాధికారాన్ని స్వాయత్తం చేసుకున్నది. అయోధ్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన భావాలను సమకూర్చినది ఆరెస్సెస్సే. జనవరి 2024లో అయోధ్య రామాలయంలో బాల రాముడికి ప్రాణప్రతిష్ఠ జరిగినప్పుడు భారతదేశ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమయిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివర్ణించారు. ఆ ఆలయ ఆరంభం చరిత్రలో హిందువులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే దిశగా ఒక ‘నాగరికతా న్యాయ చర్య’ అని కూడా ఆయన పేర్కొన్నారు. శ్రీరామ్ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్‌లో నియమితులు అయిన వారందరూ సంఘ్ పరివార్, కేంద్ర ప్రభుత్వ విశ్వాసం పొందినవారేననడంలో సందేహం లేదు. ఆరెస్సెస్, బీజేపీ, వీహెచ్‌పీ నాయకత్వాలే వారిని ఎంపిక చేసి నియమించడం జరిగింది. మరి ట్రస్ట్ కార్యకలాపాలలో చోటుచేసుకున్న అవినీతికి కొంతమంది ఉద్యోగులను బాధ్యులను చేయడం సమంజసమేనా? ఒక సంస్థ లేదా ఉద్యమ విజయాలకే కాకుండా దాని వైఫల్యాలకు కూడా బాధ్యత వహించడం నైతిక విధి కాదా? సరే, అయోధ్య రామాలయ నిర్వహణ తీరుతెన్నులపై ప్రశ్నలు కొత్తవేమీ కావు. అయోధ్యలో భూ సంబంధ లావాదేవీలపై ఆరోపణలు తొలుత 2022లోనే వచ్చాయి. ఆలయ పాలనలో పారదర్శకతపై అవి తీవ్ర అనుమానాలకు తావిచ్చాయి. ఆ ఆరోపణలు అంతిమంగా న్యాయ విచారణలో రుజువవుతాయా లేదా అన్నది అటుంచి, అసలు అవి వెలుగులోకి వచ్చినప్పుడే ఆలయ వ్యవహారాలపై మరింత జాగరూకత వహించి ఉండాల్సింది. కోట్లాది ప్రజల విశ్వాసంతో ముడివడి ఉన్న సంస్థల నిర్వహణలో ఎటువంటి అపారదర్శకతకు ఆస్కారముండకూడదు. అయోధ్య ఆలయంలో అవినీతి కేవలం నేరారోపణ అర్హత కంటే విస్తృత అంశం. ఎవరు ఆ అవినీతికి పాల్పడింది, ఎవరు శిక్షార్హులు అనే విష యాలను దర్యాప్తు అధికారులు, న్యాయ స్థానాలు నిర్ణయిస్తాయి. ఇక్కడ పరిగణనలోకి తీసుకోవల్సిన అంశం సంస్థాగత జవాబుదారీతనం. ఇది ముఖ్యం. సంఘ్ పరివార్ భావజాల సాఫల్యానికి ప్రతీక అయోధ్య. రామాలయంలో నిధుల చోరీ జరిగిందన్న ఆరోపణ రుజువయితే మత విశ్వాసాలతో ముడివడి ఉన్న సంస్థలు సైతం అధికార ప్రాపకంతో అవినీతి మయమవుతాయనే సత్యం నిర్ధారితమవుతుంది. ఈ కారణంగానే రామమందిర్ ఉద్యమంతో రాజకీయంగా, నైతికంగా లబ్ధి పొందినవారు, ఆలయంలో జరిగిన అవినీతికి ఉద్యోగులే బాధ్యులని అనడం న్యాయ విరుద్ధమేకాదు, అనైతికం కూడా. అయోధ్య రామాలయానికి కొత్త పరిపాలనా వ్యవస్థ ఏర్పాటవుతుంది. దాని ఆర్థిక వ్యవస్థలను చక్కదిద్ది పటిష్ఠం చేస్తారు. నిధుల తస్కరణకు పాల్పడినట్టు రుజువు అయిన వారికి తప్పక శిక్షలు పడతాయి. అయితే దెబ్బతిన్న పేరు ప్రతిష్ఠల పునరుద్ధరణ సంస్థలు, వ్యవస్థలను చక్కదిద్దినంత తేలిక కాదు. శతాబ్ది ఉత్సవాలు జరుపుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నేడు భారతదేశ ప్రజా జీవనంలో మున్నెన్నడూ లేని రీతిలో ఒక ప్రభావశక్తిగా వెలుగొందుతోంది. ఆ ప్రభావ ప్రాబల్యాలతో పాటు దాని బాధ్యతలు కూడా అంతేస్థాయిలో పెరిగాయి. రాజకీయ పార్టీలు, ఇతర సంస్థల నుంచి తాను ఒకప్పుడు ఎటువంటి నైతిక ప్రమాణాలను డిమాండ్ చేసిందో సంఘ్ ఇప్పుడు అవే నైతిక ప్రమాణాలను తనకూ వర్తింపజేసుకోవాలి. ఆలోచనలలోను, ఆచరణలోను అత్యున్నత నైతిక ప్రమాణాలను పాటించవలసిన బాధ్యత ఇప్పుడు సంఘ్‌పై ఉన్నది. దాదాపు నలభై ఏళ్ల క్రితం అయోధ్య ఉద్యమ ఆర్థిక వ్యవహారాలలో జవాబుదారీతనం గురించి నేను అడిగిన ప్రశ్నను అశోక్ సింఘాల్ ఆగ్రహంతో కొట్టివేశారు. హిందువుల విశ్వాసాన్ని రామ మందిర్ ఉద్యమం దగా చేయదని ఆయన నైతిక ధీమాతో చెప్పారు. మరి ఈ రోజు అయోధ్య విరాళాల విషయంలో జవాబుదారీతనంపై ప్రశ్నకు సంఘ్ పరివార్ నాయకుడు ఎవరైనా అటువంటి నైతిక అధికారంతో సమాధానమివ్వగలరా? రాజకీయ అధికారం తాత్కాలికమైనది. దాన్ని నేడు గెలవవచ్చు, రేపు కోల్పోవచ్చు, పిదప మళ్లీ సాధించుకోవచ్చు. నైతిక పలుకుబడి భిన్నమైనది. అరుదైన ఈ గుణశీలత ఒకసారి క్షీణిస్తే దానిని మళ్లీ పొందడం చాలా చాలా కష్టం. అనంతంగా అసాధ్యం.

# ఎస్ఐఆర్ కు రాజకీయ పార్టీల సహకారం అవసరం

**-ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం**

**-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

హంసకలం వార్త

జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమం పురోగతిపై ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని, బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వోలు) ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన పలు అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఓటరు నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇంటింటి సర్వే నిర్వహణ, బీఎల్‌వోల పనితీరు తదితర అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను సమావేశంలో వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి అంశాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శ్రద్ధగా విని, సంబంధిత అధికారులకు తక్షణమే అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఫిర్యాదు, ప్రతి అభ్యర్థనను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటూనే, అర్హత కోల్పోయిన వారి వివరాలను నిబంధనల ప్రకారం తొలగించడం, అవసరమైన సవరణలు చేపట్టడం వంటి ప్రక్రియలను పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని వివరిం చారు. ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం అత్యంత కీలకమని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. రాజకీయ పార్టీల సహకారంతో ఎన్నికల ప్రక్రియ మరింత విశ్వసనీయంగా, పారదర్శకంగా కొనసాగుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్ల



తొలగింపు వంటి ప్రక్రియలు ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా మార్పులు లేదా సవరణలు అవసరమైతే నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్‌తో పాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బాలకృష్ణ, ఎండి హుస్సేన్, నరసింహ, రామకృష్ణ, తదితరులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలి

**-సిఎంఆర్ సరఫరాలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలి**

**-జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వి రాములు**

హంసకలం వార్త

జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వి.రాములు అన్నారు.శుక్రవారం జిల్లాలోని నస్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్)ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. సంబంధిత జి.పి.ఓ.లు బి.ఎల్.ఓ.లు , బి.ఎల్.ఓ. సూపర్‌వైజర్లు, అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయడంతో పాటు,సమాచార నమోదు,సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత ఖచ్చితత్వంతో విధులు నిర్వహించాలని సూచించారు.ప్రతి దశలో నాణ్యతను పాటిస్తూ నిర్ణీత కాలపరిమితిలో పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.మందమర్రి మండలం అందుగులపేట గ్రామంలోని వాసవి రైస్ మిల్లు,లక్ష్మీ గణపతి రైస్ మిల్,అంబికా సాయి రైస్



మిల్లులను తనిఖీ చేశారు.మిల్లింగ్ కార్యకలాపాలను తక్షణమే ప్రారంభించి, కస్టమ్ మిల్డ్ రైస్ (సి ఎమ్ ఆర్ )ను ప్రభుత్వానికి సకాలంలో అందజేయాలని రైస్ మిల్లుల నిర్వాహకులను ఆదేశించారు.సిఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేసి,ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా బియ్యం సరఫరా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, ఇకపై ఎలాంటి జాప్యానికి తావు లేకుండా మిల్లింగ్ ప్రక్రియను పూర్తి చేసి సిఎంఆర్‌ను సకాలంలో అందజేయాలని సూచించారు.అనంతరం మంచిర్యాల మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, జి.పి.ఓ.లు,బి.ఎల్.ఓ.లు,ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న ఇతర అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్‌లో ఉన్న కార్యకలాపాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సేకరిస్తున్న సమాచారాన్ని స్పష్టంగా నమోదు చేయడంతో పాటు ఎన్యుమరేషన్ ప్రక్రియను డిజిటలైజ్ చేయాలని సూచించారు. డేటా సేకరణలో పారదర్శకత, నాణ్యతను పాటించాలని,ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఎలాంటి జాప్యం లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలలే ప్రకృతి సంరక్షకులు

**-ప్రకృతి సంరక్షణలో విద్యార్థులే భవిష్యత్ నాయకులు:**

**-పర్యావరణ పరిరక్షణకు ప్రతి విద్యార్థి ఎర్త్ లీడర్‌గా ఎదగాలి**

హంసకలం వార్త

ప్రకృతి పరిరక్షణలో విద్యార్థులే భవిష్యత్ నాయకులని, పర్యావరణాన్ని కాపాడే బాధ్యత నేటి బాలల భుజాలపై ఉందని ప్రముఖులు పేర్కొన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) సంయుక్త ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపికైన యంగ్ ఎర్త్ లీడర్స్ కోసం నిర్వహిస్తున్న రెండు రోజుల 'పర్యావరణ శిక్షణ శిబిరం' సోమవారం కడ్తాల్ మండలం అన్మాస్పల్లి ఎర్త్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైంది. సీజీఆర్ ఫౌండర్ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి, ఫౌండర్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐ. గణపతి రెడ్డి, జి. ప్రసన్న కుమార్ లు హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వాతావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టం, కాలుష్యం వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యత, అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని అన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం




కాకుండా పర్యావరణ పరిరక్షణలో ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం, నీటి వృథాను నివారించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిశుభ్రమైన పరిసరాల కోసం కృషి చేయడం వంటి చర్యల ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.ఈ శిక్షణ ద్వారా పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, జీవవైవిధ్య సంరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవడం, సహజ వనరుల పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ పాఠశాలల్లోని తోటి విద్యార్థులతోపంచుకోవడంతో పాటు గ్రామాల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించాలని పిలుపునిచ్చారు. యంగ్ ఎర్త్ లీడర్స్‌గా ఎంపికైన విద్యార్థులు తమ పాఠశాలలు, గ్రామాల్లో పర్యావరణహిత కార్యక్రమాలను చేపట్టి చెట్ల పెంపకం, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, విద్యార్థుల భాగస్వామ్యంతోనే హరిత భవిష్యత్తు సాధ్యమవుతుందని వక్తలు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్టీ ఉపేందర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, వైఈఎల్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ యనాల వెంకట్ రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్ రెడ్డి, పుడమి వ్యవస్థాపకులు రమేష్ రావు, వైఈఎల్పీ ఇన్‌చార్జ్ రజనీకాంత్, సీజీఆర్ సభ్యులు నగేష్, శంకరయ్య, హనుమంత్, ఉపాధ్యాయులు, యంగ్ ఎర్త్ లీడర్స్‌గా ఎంపికైన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ.వీ.ఎం గోదాము తనిఖీ

**-భద్రత ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**




హంసకలం వార్త

సాధారణ తనిఖీ లో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలమేరకు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లో గల ఈవీఎం లను భద్రపరిచిన గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్. ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యవేక్షణలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ మరియ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత**




హంసకలం వార్త

బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామంలో భూ భారతి - రీ సర్వే గ్రామ సభ నిర్వహించిన జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా మల్యాల మండలంలోని సర్వా పూర్ గ్రామంలో భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహణ సదస్సు ( గ్రామ సభ) నిర్వహించారు. భూమి రీ- సర్వే చేయుటలో చట్టం పరిదిలో వున్నా సర్వే సరిహద్దుల చట్టం1923 గురించి మరియు సర్వే కార్యాక్రమాల గురించి, సర్వే చేయు పని విదానాల గురించి ఇట్టి గ్రామ సభలో గ్రామ రైతులకు మరియు గ్రామ ప్రజలకు అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో భూమి కొలతల ఏ. డి కిషన్ ప్రసాద్, తహసీల్దార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలి

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



హంసకలం వార్త

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి జిల్లా విద్యాశాఖ, మహిళ-శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పించి సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. అంగన్వాడిలోని పిల్లలు ప్రభుత్వ పాఠశాలలలో చేరేలా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ఆహారం రుచిని ఉపాధ్యాయులు ముందుగా పరీక్షించాలని,వంట మనుషులకు, సహాయకులకు అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. ఈసారి పిల్లలకు అందించే ప్రోగ్రెస్ కార్డులను హోలీస్టిక్ కార్డులుగా అందించడం జరుగుతుందని, నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
శనివారం 11 జూలై 2026

## ఉపాధ్యాయులు ఆధునిక విద్యా బోధనలు అలవర్చుకోవాలి

-అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత




హంసకలం వార్త

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ ఉపయోగించుకొని ఉపాధ్యాయులు ఉత్తమ మైనటువంటి విద్యార్థులను ఉత్తమ ఫలితాలు దిశగా బోధన జరపాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లతా అన్నారు స్థానిక ఓల్డ్ హైస్కూల్ జగిత్యాలలో గత మూడు రోజులుగా నడుస్తున్న జిల్లాస్థాయి ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాల నుండి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పినందుకు ఉపాధ్యాయులను వారు అభినందించారు మూసి వేయబడిన పాఠశాలలను పున ప్రారంభించినందుకు అభినందించారు తరగతి గది బోధనతోపాటు ఐఐటి ఫౌండేషన్ పిల్లలను పెంపొందించేలా బోధనలు జరపాలని దీనికి ఖాన్ అకాడమీ మరియు శిక్ష కో పైలట్ తెలంగాణ డాట్ కం వెబ్సైట్ ద్వారా పాఠ్యప్రణాలు రూపొందించడం విద్యార్థులకు ప్రశ్నాపత్రం మరియు అసైన్మెంట్ ఇస్తూ వారిని నిష్ణాతులు గా తయారుచేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమీ అధికారి చంద్రశేఖర్ రెడ్డి రిసోర్స్ పర్సన్స్ పరమేశ్వర్ రాజ్ కుమార్ జగదీశ్వర్ లక్ష్మణ్ పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు వూటూరి హరీష్ తపస్సు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వీర్లమల వెంకట్ రమణారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల సమస్యల పరిష్కారానికై ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి

-సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలి..

-లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్..

హంసకలం వార్త



జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ ను శుక్రవారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి,అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సూచనలు చేశారు.సీఐఈఆర్ పోర్టల్ వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలోని క్రైమ్ ప్రాపర్టీని పరిశీలించి వాటి భద్రత,నిర్వాహన పై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.డయల్ 100 కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్సైలు అఖిల, రాజమౌళి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడి మర్మాంగాలు నలిపి హతమార్చిన స్నేహితులు

హంసకలం వార్త



గంజాయి వ్యాపారంలో వివాదాలు, ఓ అమ్మాయి విషయంలో జరిగిన గొడవ కారణం గా హత్య చేసినట్టు గుర్తింపు హైదరాబాద్ -- పసుమాములలో తన తల్లితో కలిసి నివసిస్తూ, గంజాయికి బానిసగా మారి గంజాయి వ్యాపారం కూడా చేస్తున్న నిషాని సుహాస్(22) అనే యువకుడు గతంలో సికింద్రాబాద్ ప్రాంతంలో నివసిస్తుండగా, కొడుకు తప్పుదోవ పడుతున్నాడని, భర్త చనిపోయినా కూతురు పెళ్లి చేసి, పసుమాములలో సొంత ఇల్లు కొని అక్కడికి మకాం మార్చిన సుహాస్ తల్లి ఫోన్ లేకపోవడంతో తన స్నేహితులు రాకేష్, పరుశురాం, రాజులలో ఒకరి ఫోన్ తీసుకొని, ఇన్స్టాగ్రామ్ ద్వారా అతని లవర్కు అసభ్యకర మెసేజెస్ పంపడం మొదలు పెట్టిన సుహాస్ సదరు యువతి ఈ విషయాన్ని తన బాయ్ ఫ్రెండ్కు చెప్పడంతో, సుహాస్ను హతమార్చాలని నిర్ణయించుకున్న అతని స్నేహితులు గతంలో గంజాయి వ్యాపారంలో వారి మధ్య ఉన్న లావాదేవీల వివాదాలు బయటికి తీసి, సుహాస్తో గొడవ పెట్టుకోసాగిన యువకులు పసుమాముల వెళ్లి, మాట్లాడాలని సుహాస్ను ఊరి శివారులో ఉన్న మర్రి చెట్టు వద్దకు తీసుకెళ్లి దాడి చేసిన రాకేష్, పరుశురాం, రాజు, మరో వ్యక్తి భయంతో పారిపోతున్నా కూడా వదలకుండా, వెంటపడి సుహాస్ మర్మాంగాలు నలిపి చనిపోయేవరకు కొట్టి, అక్కడే వదిలేసి వెళ్ళిన నిందితులు సుహాస్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుల్లో ఒకరిని అరెస్ట్ చేసి, ఇతరుల కోసం గాలిస్తున్న పోలీసులు

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

-భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ

హంసకలం వార్త




ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అన్నారు.శుక్రవారం న్యూ ఢిల్లీ నుండి కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి,అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు,కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ...ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని అన్నారు.ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు.18 సంవత్సరాల వయసు నుండి అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు, ఆయా నియోజకవర్గంలో సాధారణ నివాసితులు, చట్టపరంగా అనర్హులు కాని వారు ఓటరుగా నమోదు కావచ్చని తెలిపారు.ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 24 తేదీ నాటికి డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, దేశ వ్యాప్తంగా గతంలో కూడా పలు మార్లు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా జిల్లా ఎన్నికల అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు. దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1 వేయి 200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ 99.6 శాతం, డిజిటైజేషన్ ప్రక్రియ 21.94 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన ఫారాలు ఈరోజు పంపిణీ పూర్తి చేసి డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.మ్యాపింగ్ చేసిన డాటా ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాలను సరిచూసుకొని డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అమలులో అలసత్వం ప్రదర్శించిన సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు

హంసకలం వార్త



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారంలను తగిన వివరాలతో పూరించి త్వరితగతిన బీ.ఎల్.ఓలకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఓటర్లకు సూచించారు. వివరాలను డిజిటలైజేషన్ చేయాల్సి ఉన్నందున, నిర్ణీత గడువు వరకు వేచి చూడకుండా వెంటదివెంట ఫారాలను నింపి బీ.ఎల్.ఓలకు సమర్పించాలని ఓటర్లను కోరారు. శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటి కమిషనర్ పవన్ కుమార్ శర్మ న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డితో పాటు అన్ని జిల్లా కలెక్టర్లతో ఎస్.ఐ.ఆర్ అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాల వారీగా ఎస్.ఐ.ఆర్ అమలులో ఇప్పటివరకు సాధించిన ప్రగతి గురించి అడిగి తెలుసుకుని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల నుండి ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వాటి వివరాలను డిజిటలైజ్ చేయడంలో వెనుకంజలో ఉన్న సూపర్వైజర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో పురోగతి చూపని నిజామాబాద్ అర్బన్ పరిధిలోని ముగ్గురు సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్.ఐ.ఆర్ అమలు తీరును తేలికగా తీసుకోరాదని, నిర్ణీత గడువు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయని వారిపై ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. గడువు సమీపించిన దృష్ట్యా శని, ఆదివారాలు సెలవు దినాలలో కూడా పని చేయాలని తేల్చి చెప్పారు. వచ్చే సోమవారం నాటికి అర్బన్ లో 35 శాతం, రూరల్ నియోజకవర్గాల పరిధిలో 50 శాతం ప్రక్రియ పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలు కూడా క్షేత్రస్థాయిలో ఉంటూ, ఎన్యూమరేషన్ ఫారంల సేకరణ, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియలు వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ జరపాలని, రోజువారీ ప్రగతిని తనకు నివేదించాలని ఆదేశించారు. బీ.ఎల్.ఓలకు సహకారం అందించేలా వీ.ఓ.ఏలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులతో కూడిన వారిని వాలంటీర్లుగా నియమించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరు ఓటర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఎన్యూమరేషన్ ఫారాలు సరైన విధంగా పూరించడంలో వారికి సహకరించాలని హితవు పలికారు. ప్రతి బీ.ఎల్.ఓ వద్ద ఫొటోలతో కూడిన ఓటరు జాబితా తప్పనిసరిగా ఉండాలన్నారు. వివరాల పరిశీలన సమయంలో అందుబాటులో లేని, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్ళిన, రెండు చోట్ల ఓటు కలిగిన ఓటర్ల పేర్లను గుర్తిస్తూ పక్కాగా జాబితాను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ జాబితాపై రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని సూచించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బీ.ఎల్.ఏలు స్థానికంగా అందుబాటులో ఉంటూ, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు బీ.ఎల్.ఓలకు తగిన సహకారం అందించాలని అన్నారు. ప్రతి రోజు ఓటర్ల నుండి 50 చొప్పున ఎన్యూమరేషన్ ఫారంలు సేకరిస్తూ బీఎల్ఓలకు అందించాలని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తగు చొరవ చూపాలని కలెక్టర్ కోరారు. కాగా, ఎన్యూమరేషన్ ఫారంలు అందించే విషయంలో ఓటర్లు తాత్సారం చేయకుండా, వెంటనే ఫారాలను వివరాలతో నింపి బీ.ఎల్.ఓలకు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏఈఆర్ఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభకు వైరా నియోజకవర్గ నుంచి 60 వేల మంది..

-ఎమ్మెల్యే రాందాస్ నాయక్

హంసకలం వార్త




చింతకాని మండలం జగన్నాధపురం లో జరిగే రైతు ఆశీర్వాద సభకు వైరా నియోజకవర్గ నుంచి 60 వేల మంది తరలి వెళ్ళినట్లు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తెలిపారు .ఈ సందర్భంగా వైరాలో బస్సులను ఎమ్మెల్యే రామదాసు నాయక్ శుక్రవారం సూడ చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, హస్తకాల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మార్క్ ఫైడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్ర రాజశేఖర్ తో కలిసి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాందాసు నాయక్ మాట్లాడుతూ రైతు కోసం రైతు ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రైతులుఎక్కడ ఇబ్బంది పడకుండా అన్ని విధాల ఆదుకునేఅందుకే ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఏ, రైతు కూడా ఎక్కడ కష్టపడకుండా చూడడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఆశీర్వాద సభకు వైరా నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 60000 మంది తరలి వెళ్ళినారని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మార్కెట్ చైర్మన్ గంగారావు,కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి,ఏదునూరి సీతారాములు, దాసరి దానియేలు ,పమ్మీ అశోక్ ,చెరుకూరి కిరణ్, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి ,మగడాల మంజుల, వీరంశెట్టి సీతారాములు, వడ్డే నారాయణ మల్లు రామకృష్ణ , జవ్వాజి నాగరాజు, తోటకూర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నీతి, నిజాయితీ, నిర్భీతితో వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకున్న వారే నిజమైన జర్నలిస్టులు

**-మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి**

హంసకలం వార్త



ప్రజల ఆకాంక్షాలకు అనుగుణంగా, నీతి, నిజాయితీ, నిర్భీతితో పనిచేస్తూ, వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకునేవారే నిజమైన జర్నలిస్టులని, అలాంటి వారినే సమాజం అక్కున చేర్చుకుంటుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన కృతజ్ఞత సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో అక్రెడిటేషన్ కార్డులను కొందరు అంగట్లో సరుకుగా మార్చి, దాని విలువ లేకుండా చేసారని, ఈ చర్య వల్ల సమాజంలో దుష్పరిణామాలు చోటు చేసుకున్నాయని శ్రీనివాస్ రెడ్డి విచారం వ్యక్తం చేసారు. అక్రెడిటేషన్ అనేది వృత్తి గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. మీడియా రంగాన్ని కలుషితం చేస్తూ అపహాస్యానికి గురిచేస్తున్న వారిని గుర్తించి, వారికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మీడియాలో చోటు చేసుకుంటున్న పరిణామాలను ఆసరగా చేసుకుంటూ, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులు సాధించుకున్న సౌకర్యాలను, చట్టాలను రద్దు చేసేస్తుందని, ఆ చర్యలను అడ్డుకోవాలంటే జర్నలిజం వృత్తి నిబద్ధతను మనం నిరూపించుకోవాల్సి ఉంటుందని ఆయన సూచించారు. సామాన్యుల భావప్రకటన స్వేచ్ఛకు సోషల్ మీడియా మంచి వేదిక అయినప్పటికీ, అందులో మంచితో సమానంగా చెడు, కల్పితాలు, అవాస్తవాలు ట్రోల్ అవుతుండడంటో దానికి విలువ లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంతోనే దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరిస్తూ కఠినమైన నిర్ణయాలను తీసుకోబోతుందని ఆయన అప్రమత్తం చేసారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో వీడియో జర్నలిస్టులు సంఘటితమై బలమైన సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఫోటో గ్రఫీ డే మాదిరిగానే వీడియో గ్రఫీ డే ను కూడా నిర్వహించడానికి అకాడమీ యోచిస్తుందన్నారు. ఏఐ ను తట్టుకొని నిలబడే విధంగా వీడియో జర్నలిస్టులకు అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా వీడియో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఆయా మీడియా సంస్థల్లో పనిచేస్తున్న వీడియో జర్నలిస్టులతో పాటు ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు తాము నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వీడియో జర్నలిస్టులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని విరాహత్ అలీ కోరారు. తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సన్నీ, అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు, రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు వనం నాగరాజు, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కిరణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అక్రెడిటేషన్ కార్డుల ప్రధానోత్సవం జరిగింది.

# రెండేళ్లలో ప్రతి రైతుకూ మ్యాప్‌తో కూడిన 'భూదార్'

**-భూభారతి'తో సరికొత్త భూ విప్లవం..**
**-చింతకాని సభలో మంత్రి పొంగులేటి కీలక ప్రకటన**
**-ముల్లుగమాడ్ రైతులకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదుగా రికార్డుల పంపిణీ..**
**-రెండేళ్లలోనే 71 వేల ఉద్యోగాల భర్తీ..**
**-త్వరలోనే మరో 20 వేల నోటిఫికేషన్లు**
**-మహిళా సంఘాలకు సున్నా వడ్డీకే రూ.63 వేల కోట్లు.. ప్రతిపక్షాల అబద్ధాల ప్రచారాలపై మంత్రి పొంగులేటి ఫైర్..**

హంసకలం వార్త



చింతకాని: "భూభారతి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాం. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి భూమినీ సర్వే చేసి, సాగులో ఉన్న ప్రతి రైతుకు మ్యాప్‌తో కూడిన 'భూదార్' కార్డును అందజేస్తాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. చింతకాని మండలం జగన్నాథపురం వద్ద రాష్ట్ర రైతాంగానికి రూ.9 వేల కోట్ల 'రైతు భరోసా' నిధులను జమ చేసిన సందర్భంగా నిర్వహించిన చారిత్రాత్మక 'రైతు ఆశీర్వాద సభ'లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ , పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ వేదికపై మంత్రి పొంగులేటి భూ సంస్కరణలతో పాటు ప్రభుత్వ ప్రగతిని వివరించారు.

**-ముల్లుగమాడ్‌లో పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్..**

ఇప్పటికే ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూభారతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మధిర నియోజకవర్గంలోని ముల్లుగమాడ్ రెవెన్యూ గ్రామంలో సర్వే పూర్తి చేసి, సుమారు 476 మంది రైతులకు మ్యాప్‌లతో కూడిన భూదార్ కార్డులను సిద్ధం చేశామన్నారు. ఈ సభా వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా రైతులకు ఈ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అందరికీ ఇదే పద్ధతిలో కార్డులు ఇస్తామని మంత్రి ప్రకటించారు.

**-నిరుద్యోగులకు వరం... మహిళలకు అండ**

ఈ రెండున్నర ఏళ్లలోనే సుమారు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్లను సున్నా వడ్డీకే అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని మంత్రి కొనియాడారు. నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు మొదటి రెండేళ్లలోనే రికార్డు స్థాయిలో 71 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, రాబోయే కొద్ది రోజుల్లోనే మరో 17 వేల నుంచి 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నామని సగర్వంగా ప్రకటించారు.

**-అవినీతి పిల్లర్లపై కాళేశ్వరం...**

ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాలేదని, చేతల్లో చూపిస్తోందని మంత్రి అన్నారు. గత పాలకులు తాము చేసిన తప్పులను, అబద్ధాలను ఈ ప్రభుత్వంపై రుద్దాలని చూస్తున్నారని మండిపడ్డారు. "ఎన్నికల ముందే చెప్పాం... కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రతి పిల్లర్‌లోనూ అవినీతి కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని. ఇవాళ అదే నిజమైంది" అని విమర్శించారు. నీటిపారుదల శాఖపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని, అబద్ధాల ప్రచారం మానుకోకపోతే ప్రజలు రాబోయే రోజుల్లోనూ తగిన బుద్ధి చెప్పడం ఖాయమని? హెచ్చరించారు.

**-పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం..**


అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందించడమే రేవంత్ అన్న నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించి రెండవ విడత పూర్తి చేసిందని, రాబోయే రోజుల్లో మిగిలిన విడతలను కూడా శరవేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.

# జర్నలిస్టుల సమస్యలపై టిడబ్ల్యూజేఎఫ్ ధర్నా

**-జూలై 13న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట నిరసన**
**-జూలై 15న సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద బహిరంగ నిరసన**
**-టీడబ్ల్యూజేఎఫ్ పిలుపు**

హంసకలం వార్త

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి డబ్ల్యూ జె ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా 13,వ తేదీన మేడ్చల్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా ను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్ జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర నాయకులు గుమ్మడి హరిప్రసాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు పబ్బు మల్లేష్ గౌడ్, బనావత్ రవి నాయక్ అభిప్రాయపడ్డారు. ఈనెల 13న జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాలు అందజేసి నిరసనలు, 15న రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. జర్నలిస్టుల హెల్త్‌కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు అన్నారు . హెల్త్ కార్డులు నిమ్స్ ఆస్పత్రి మినహా ఏ ఇతర కార్పొరేట్ ఆస్పత్రుల్లో పని చేయడం లేదని వ్యాఖ్యనించారు. వెంటనే జర్నలిస్టులందరికీ నూతన హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఇండ్ల స్థలాలపై నిర్ణయం తీసుకోకపోవడంతో కార్యాచరణ ముందుకు సాగడం లేదని తెలిపారు. ఇండ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఆశలు కల్పించి ఆ తర్వాత వారి ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు. అక్రిడిడేషన్ కార్డుల పంపిణీ ఆలస్యమవుతున్నదని, అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిడేషన్ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడేషన్ కార్డులు ఆలస్యం కావడంతో బస్‌పాసులు రాక జర్నలిస్టులు ఇబ్బందులు పడుతు



న్నారని వారు గుర్తేచేశారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా నిస్వార్ధంగా పనిచేస్తున్నారు, అట్టి జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రతి నెలా పెన్షన్ 10వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర నాయకులు గుమ్మడి హరిప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రైతును రాజు చేయాలన్నదే ప్రజాప్రభుత్వం లక్ష్యం

**-ఖమ్మం రైతు ఆశీర్వాద సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి.**



హంసకలం వార్త

రైతును రాజు చేయాలన్నది ప్రజా ప్రభుత్వం లక్షమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఖమ్మం జిల్లాలో రైతు బంధు నిధుల కార్యక్రమం రైతు ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, చెప్పినట్టుగానే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశామని చెప్పారు. 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతులకు అందించామన్నారు. రెండో విడతగా ఈరోజు మిగిలిన రైతులకు డబ్బులు అందించామని వివరించారు. రైతులకు ఇప్పటికే రైతు రుణమాఫీ,పంట నష్ట పరిహారం, ఉచిత విద్యుత్ ద్వారా రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజాప్రభుత్వం ప్రతి నెలా సగటున 5525 కోట్ల చొప్పున ఇప్పటివరకు 1 లక్షా 70 వేల కోట్ల రూపాయలు రైతాంగానికి ఖర్చు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్,తహసిల్దార్ లక్ష్మణ్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎస్ కు "మాచన" ప్రార్ధన

**-విద్యా సంస్థల వద్ద పొగాకు నియంత్రణకు విజ్ఞప్తి**

హంసకలం వార్త



సార్..చీఫ్ సెక్రటరీ గారు స్కూళ్లు, కాలేజీల వద్ద పొగాకు ఉత్పత్తులను నిషేధించండి.నో స్మోకింగ్ జోన్ గా చేయండి" ప్లీజ్ అంటూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శికి పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాహశీల్దార్, టుబాకో కంట్రోల్ హీరో అవార్డు గ్రహీత మాచన రఘునందన్ లేఖ రాశారు. శుక్రవారం ఆయన బేగంపేట తపాల కార్యాలయం ద్వారా సిఎస్ కార్యాలయానికి లేఖ పంపారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రికి సైతం ఈ విషయం విన్నవించినట్టు తెలిపారు. తెలంగాణలో స్కూళ్లు,కాలేజీల వద్ద పొగాకు నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా లేఖ రాశానన్నారు.తమ పిల్లలు స్కూళ్లు,కాలేజీల వద్ద ఏయే అలవాట్లకు "గురి" అవుతున్నారో తెలిసి కూడా ఏమి చేయలేని నిస్సహాయ,అసహాయ స్థితిలో తల్లిదండ్రులు ఉంటున్నారని,అలా తమ బిడ్డలను ఎలా కాపాడుకోవాలన్న నిర్వేదంలో ఉన్నపుడు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కూళ్లలో మాదక ద్రవ్య నిరోధక కమిటీలు వేయడం ఓ నవశ గ్గకానికి దారి తీసిందన్నారు.అలాగే ఎక్కడ పడితే అక్కడ విచ్చల"విడిగా" దొరికే సిగరెట్,బీడీల విక్రయాన్ని కూడా స్కూళ్లు,కాలేజీలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిషేధిస్తే..దేశంలోనే తెలంగాణ ఆదర్శ రాష్ట్రం అవుతుందని రఘునందన్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఝార్ఖండ్ రాష్ట్రం తరహాలో ప్రభుత్వ ఉద్యోగం కోరే అభ్యర్థుల నుంచి "మాకు పొగాకు ఉత్పత్తుల వినియోగం అలవాటు లేదు.మేము పొగాకు ఉత్పత్తులను వినియోగించము" అనే వ్రాత పూర్వక హామీ పత్రం తీసుకుని,ఆ తర్వాతే నియామకాలు చేపట్టాలని రఘునందన్ సూచించారు. సాధారణ పౌరుల కంటే ప్రభుత్వ ఉద్యోగులకు మరింత బాధ్యత ఉంటుందని,సమాజానికి వారు ఉదాహరణగా నిలిచేలా వారి నడత ఉండాలని,ఆ మేరకే ప్రభుత్వ ఉద్యోగులను పొగాకు ఉత్పత్తుల వినియోగం అలవాటుకు దూరంగా "సే నో టు టుబాకో" అనే విధంగా ఝార్ఖండ్ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని రఘునందన్ హర్షం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం..!

**-గోదాం నుంచి గుడిసెలకు వ్యాపించిన మంటలు**
**-పరుగులు తీసిన కాలనీవాసులు**
**-మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది**
**-చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**

హంసకలం వార్త



నగరంలోని చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.మూసీ నది సమీపంలో ఉన్న డెకరేషన్ సామగ్రి గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది.గోదాంలో ప్లాస్టిక్ వస్తువులు,థర్మాకోల్ షీట్లు, అలంకరణ సామగ్రి,బట్టలు వంటి అత్యంత సులభంగా మంటలు అంటుకునే వస్తువులు పెద్ద ఎత్తున నిల్వ ఉండటంతో అగ్ని వేగంగా వ్యాపించింది.దీంతో దట్టమైన నల్లటి పొగ ఆకాశాన్ని కమ్మేయగా, మంటలు భారీగా ఎగిసిపడటం చూసిన స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. గోదాం నుంచి మంటలు సమీపంలోని గుడిసెలకు కూడా వ్యాపించడంతో అక్కడ నివసిస్తున్న కుటుంబాలు వెంటనే బయటకు పరుగులు తీశాయి.సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు రెండు ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమించారు.అగ్నిప్రమాదం కారణంగా గోదాంలో నిల్వ ఉంచిన సామగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు తెలుస్తోంది.అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదంతో ఆ ప్రాంతంలో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా,పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.అగ్నిప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు

# బిజినెస్

## ఈ20 పెట్రోల్‌తో మైలేజ్ 3-5% తగ్గొచ్చు కానీ లాభాలు ఎన్నో: కేంద్రం




ఈ20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వినియోగంతో కొన్ని వాహనాల్లో మైలేజ్ 3-5 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే మైలేజ్‌ను మాత్రమే ప్రమాణంగా చూడకూడదని, ఈ20 వల్ల అనేక కీలక ప్రయోజనాలు లభిస్తాయని స్పష్టం చేసింది. ఈ20 పెట్రోల్‌కు సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే అధిక ఆక్టేన్ రేటింగ్, మెరుగైన యాంటీ-నాక్ లక్షణాలు ఉంటాయని పేర్కొంది. దీంతో ఇంజిన్ పనితీరు మెరుగుపడటంతో పాటు వాహనానికి మంచి పికప్, సాఫీ యాక్సిలరేషన్, శుభ్రమైన ఇంజిన్ నిర్వహణ వంటి ప్రయోజనాలు కలుగుతాయని వెల్లడించింది. ఈ20 అమలుకు ముందే ఆటోమొబైల్ తయారీ సంస్థలు, విడిభాగాల తయారీదారులు, పరిశోధనా సంస్థలతో విస్తృతంగా చర్చలు జరిపినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంజిన్ పనితీరు, ఇంధన వ్యవస్థ, మన్నిక, ఉద్గారాలు, ఇంధన సామర్థ్యం వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ20 అమలు చేపట్టినట్లు పేర్కొంది. వాహన తయారీ సంస్థలు పూర్తిగా సంతృప్తి చెందకపోతే ఈ20కు మద్దతు ఇచ్చేవి కాదని, వాహనాల వారంటీలను కూడా కొనసాగించేవి కాదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం దాదాపు అన్ని కంపెనీలు పాత, కొత్త వాహనాలకు వారంటీ ఇస్తుండటమే దీనికి నిదర్శనమని పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మారుతీ సుజుకీ 2.84 కోట్ల వాహనాలకు సర్వీసింగ్ చేయగా, అందులో 1.5 కోట్ల పాత ఈ20 సర్టిఫికేషన్ లేని వాహనాలు కూడా ఉన్నాయని తెలిపింది.

## షేర్ మార్కెట్‌లో జోష్.. 827 పాయింట్లు దూసుకెళ్లిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. ఐటీ, ఆర్థికం, స్థిరాస్తి రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరగడంతో ప్రధాన సూచీలు ఒక శాతానికి పైగా ఎగిశాయి. జూన్ త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభం కావడంతో ఇన్వెస్టర్లలో ఆశావహ వాతావరణం నెలకొంది. బీఎస్ఈ సెన్సెక్స్ 827.57 పాయింట్లు పెరిగి 77,569.39 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 244.10 పాయింట్లు ఎగిసి 24,206.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఐటీ సూచీ దాదాపు 2 శాతం పెరగడం విశేషం. నిఫ్టీ రియాల్టీ సూచీ 3 శాతానికి పైగా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 3 శాతం వరకు ఎగిసింది. నిఫ్టీ50 సూచీలో జియో ఫైనాన్షియల్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, రిలయన్స్, ఎస్‌బీఐ లైఫ్ వంటి షేర్లు లాభపడ్డాయి. డాక్టర్ రెడ్డీస్, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, నెస్లే ఇండియా, సన్‌ఫార్మా షేర్లు నష్టాల్లో స్థిరపడ్డాయి. బ్యాంకుల నుంచి వచ్చిన సానుకూల వ్యాపార అప్‌డేట్లు, ఐటీ రంగంపై ఆశావహ అంచనాలు మార్కెట్‌కు బలాన్నిచ్చాయి. స్థిరమైన ఆదాయ అంచనాలు, ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ వ్యయం పెరిగే అవకాశాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అవకాశాలు ఐటీ షేర్లపై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచాయని మార్కెట్ నిపుణులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 1 శాతానికి పైగా తగ్గి 75.41 డాలర్లకు, అమెరికా డబ్ల్యూటీఐ క్రూడ్ 71.16 డాలర్లకు పడిపోయింది. ముడి చమురు ధరలు తగ్గడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) కొనుగోళ్లు మళ్లీ పెరగడం కూడా భారత మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయని నిపుణులు పేర్కొన్నారు.

## కొత్త స్టెల్త్ అవతార్‌లో టాటా హారియర్, సఫారీ.. ధరలు, ఫీచర్లు ఇవే!




టాటా మోటార్స్ తన ప్రీమియం ఎస్‌యూవీ శ్రేణిలో 2026 హారియర్, సఫారీ స్టెల్త్ ఎడిషన్‌లను భారత మార్కెట్లో విడుదల చేసింది. ఇప్పటికే ఉన్న టాప్ స్పెసిఫికేషన్స్‌తో ఫియర్‌లెస్ అల్ట్రా, అకంప్లిష్డ్ అల్ట్రా వేరియంట్ల ఆధారంగా రూపొందించిన ఈ ప్రత్యేక ఎడిషన్‌లు ఆకర్షణీయమైన బ్లాక్ థీమ్, ప్రీమియం ఇంటీరియర్‌తో కొనుగోలుదారులను ఆకట్టుకునేలా తీసుకొచ్చింది. ఇంజిన్, పనితీరులో ఎలాంటి మార్పులు చేయకుండా ప్రధానంగా డిజైన్‌పై దృష్టి పెట్టింది. 2026 టాటా హారియర్ స్టెల్త్ ఎడిషన్ ధర రూ.23.43 లక్షల నుంచి రూ.26.01 లక్షల (ఎక్స్‌షోరూమ్) వరకు ఉంది. సఫారీ స్టెల్త్ ఎడిషన్ ధర రూ.24.09 లక్షల నుంచి రూ.26.76 లక్షల (ఎక్స్‌షోరూమ్) వరకు నిర్ణయించింది. గతంలో పరిమిత సంఖ్యలో స్టెల్త్ ఎడిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన టాటా.. ఈసారి అధికారికంగా రెండు ఎస్‌యూవీ మోడళ్లలోనూ స్టెల్త్ ఎడిషన్‌ను అందిస్తోంది. స్టెల్త్ ఎడిషన్‌లో ప్రధాన ఆకర్షణ స్టెల్త్ బ్లాక్ ఎక్స్‌టీరియర్ కలర్. 19 అంగుళాల మాటే స్టెల్త్ బ్లాక్ అల్లాయ్ వీల్స్‌తో పాటు ముందు ఫెండర్‌పై ప్రత్యేక 'స్టెల్త్' బ్యాడ్జ్‌ను అమర్చారు. దీంతో డార్క్, రెడ్ డార్క్ ఎడిషన్‌లతో పోలిస్తే ఈ వేరియంట్‌కు మరింత ప్రత్యేకమైన రూపు వచ్చింది. క్యాబిన్‌లో పూర్తిగా బ్లాక్ థీమ్‌ను అందించారు. కార్బన్ నాయిర్ లెదరెట్ సీట్లు, ప్రత్యేక టెర్రైన్ రెస్పాన్స్ డయల్‌తో ప్రీమియం ఫీల్ కల్పించారు. 14.9 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, వైర్‌లెస్ ఆపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, 13 స్పీకర్ల జేబీఎల్ డాల్బీ అట్మాస్ ఆడియో సిస్టమ్, డ్యూయల్ జోన్ క్లైమేట్ కంట్రోల్, పనోరమిక్ సన్‌రూఫ్, 360 డిగ్రీ కెమెరా, లెవల్-2 అడాస్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. స్టెల్త్ ఎడిషన్‌లో ఇంజిన్‌లలో ఎలాంటి మార్పులు చేయలేదు. 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ 170 హెచ్‌పీ శక్తి, 280 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. అలాగే 2.0 లీటర్ టర్బో డీజిల్ ఇంజిన్ 170 హెచ్‌పీ పవర్, 350 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. రెండు ఇంజిన్‌లకూ 6-స్పీడ్ మాన్యువల్, 6-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఆప్షన్స్ అందుబాటులో ఉన్నాయి.

## లార్డ్స్‌లో తొలి టెస్టు: స్మృతి మంధాన అరుదైన ఘనత

ఇంటర్నెట్ డెస్క్:

భారత మహిళా జట్టు ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఆతిథ్య ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఈ ఏకైక టెస్టులో.. టీమిండియా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అరుదైన ఘనత సాధించింది. అంతర్జాతీయ కెరీర్‌లో అతి పిన్న వయసులో 300 మ్యాచ్‌లు ఆడిన బ్యాటర్‌గా నిలిచింది. ఈ క్రమంలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన భారత మహిళల జాబితాలో స్మృతి మూడో స్థానంలో ఉంది. 2013లో బంగ్లాదేశ్‌పై టీ20 మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన స్మృతి.. ఇప్పటి వరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 300 మ్యాచ్‌లు ఆడింది. ఈ జాబితాలో ప్రస్తుతం భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(374) అగ్రస్థానంలో ఉండగా, భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్(333) రెండో స్థానంలో కొనసాగుతోంది. 29ఏళ్ల స్మృతి ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు, 120 వన్డేలు, 171 టీ20 మ్యాచులు ఆడింది. మొత్తం 10వేలకుపైగా పరుగులు చేసింది. ఇందులో 17 సెంచరీలు, 74 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.




**-లార్డ్స్‌లో తొలి హాఫ్ సెంచరీ..**

లార్డ్స్ మైదానంలో భారత మహిళలకు ఇది తొలి టెస్టు కావడం విశేషం. అయితే ఈ మైదానంలో హాఫ్ సెంచరీ నమోదు చేసిన తొలి భారత బ్యాటర్‌గా స్మృతి చరిత్ర సృష్టించింది. 67 బంతుల్లో 56 పరుగులు చేసి క్రీజులో కొనసాగుతోంది. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. లంచ్ బ్రేక్ సమయానికి 3 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ(0), యాస్తికా భాటియా(12) నిరాశ పర్చారు. జెమీమా రోడ్రిగ్స్(35) పరుగులు చేసి ఔటైంది. కాగా స్మృతి మంధాన(56), హర్మన్ ప్రీత్ కౌర్(14) క్రీజులో కొనసాగుతున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్, లారెన్ ఫైలర్, ఇస్సీ వాంగ్ తలొక వికెట్ పడగొట్టారు.

## భారీ షాట్లకు ప్రయత్నించకండి.. వైభవ్, అభిషేక్ శర్మలకు బీసీసీఐ కీలక సూచనలు!

ఇంటర్నెట్ డెస్క్:

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌ను ఒక మ్యాచ్ ఉండగానే భారత్ కోల్పోయిన సంగతి తెలిసిందే. నాలుగో టీ20లో టీమిండియా 9 వికెట్ల తేడాతో ఘోర ఓటమిని చవి చూసింది. దీంతో భారత ప్లేయర్ల ప్రదర్శనపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా ఓపెనర్లు అభిషేక్ శర్మ, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఆటతీరును బోర్డు నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. సిక్సర్లపై అతిగా ఆధారపడే ధోరణిని నియంత్రించాల్సిన అవసరం ఉందని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.బీసీసీఐకి చెందిన ఓ అధికారి ఈ విషయంపై మాట్లాడారు. 'అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ సిక్సర్లు బాదే సామర్థ్యం అద్భుతం. కానీ ప్రతి బంతిని బౌండరీ దాటించాలనే ఆలోచనకు నియంత్రణ అవసరం. పరిస్థితులకు తగ్గట్టుగా ఇన్నింగ్స్‌ను నిర్మించు కోవడం కూడా నేర్చుకోవాలి' అని పేర్కొన్నట్లు సమాచారం. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత పిన్న వయసులో భారత్ తరఫున అరంగేట్రం చేసి రికార్డు సృష్టించిన వైభవ్ సూర్యవంశీకి మాత్రం ఆరంభం ఆశించినంతగా లేదు. అతడు ఆడిన




తొలి మూడు మ్యాచ్‌ల్లో 14, 13, 15 పరుగులతో నిరాశపరిచాడు. మరోవైపు అభిషేక్ శర్మ ప్రదర్శన వైభవ్‌తో పోలిస్తే మెరుగ్గా ఉన్నప్పటికీ నిలకడ లోపించింది. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లో 49, 0 పరుగులు చేసిన అతడు.. ఇంగ్లండ్ సిరీస్‌లో 59, 43, 10, 16 పరుగులు నమోదు చేశాడు. జట్టులో మెరుగ్గా రాణిస్తున్న బ్యాటర్లలో ఒకడిగా నిలిచినా, మ్యాచ్‌ను ఒంటిచేత్తో మలిచే స్థాయి ప్రభావం మాత్రం ఇప్పటివరకు చూపలేకపోయాడు. ఇలాంటి పరిస్థితుల్లో యువ ఓపెనర్లు దూకుడు కొనసాగిస్తూనే పరిస్థితులకు అనుగుణంగా బాధ్యతాయుతమైన బ్యాటింగ్ కూడా అలవర్చుకోవాలని బీసీసీఐ భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# స్పోర్ట్స్

## విదేశాల్లో భారత్ విఫలం.. ఈ నిజాన్ని అంగీకరించాల్సిందే: సహాయ కోచ్ ర్యాన్ టెన్




ఇంటర్నెట్ డెస్క్:

టీ20 ప్రపంచ కప్ 2026 తర్వాత భారత జట్టు ఇప్పటి వరకు గెలుపు రుచి చూడలేదు. ఐర్లాండ్‌తో క్లీన్ స్వీప్ అనంతరం ఇంగ్లండ్ పర్యటనకు వచ్చిన భారత టీ20 జట్టుకు ఇక్కడ కూడా షాక్ తగిలింది. ఐదు టీ20ల సిరీస్‌ను ఓ మ్యాచ్ మిగిలి ఉండగానే ఇంగ్లండ్ కైవసం చేసుకుంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీ చేపట్టిన తర్వాత టీమిండియా వరుస పరాజయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. నాలుగో టీ20లో 9 వికెట్ల తేడాతో భారత్ ఓడిపోవడంపై టీమిండియా సహాయ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. విదేశీ పిచ్‌లపై భారత్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోందని.. ఈ వాస్తవాన్ని అంగీకరించాలని స్పష్టం చేశాడు. విదేశాల్లో విఫలమనే ముద్రను తొలగించు కోవాల్సిన అవసరం భారత ప్లేయర్లపై ఉందని తెలిపాడు.పిచ్ అనుకూలిస్తేనే విజయం సాధిస్తామని చెప్పడం సులభమే. కానీ దానికి అనుగుణంగా పిచ్‌ను అర్థం చేసుకుని ప్రణాళికలు పక్కాగా అమలు చేయాలి. ప్రస్తుతం మా జట్టుకు అదే అతిపెద్ద సవాలు. ముందుగా విదేశీ పరిస్థితుల్లో మేం ఆశించిన స్థాయిలో ఆడటం లేదనే విషయాన్ని అంగీకరించాలి. ఈడెన్ గార్డెన్స్‌లో భారీ సిక్సర్లు బాది.. 250కి పైగా పరుగులు చేయడం ఒక ఎత్తు. మాంచెస్టర్, ఆస్ట్రేలియాలోని ఎంసీజీ వంటి వేదికల్లో రాణించడం మరో ఎత్తు. అన్ని పరిస్థితుల్లో విజయాలు సాధించే జట్టుగా మారాలంటే ప్లేయర్లకు మానసికంగా కూడా మార్పు రావాలి' అని పేర్కొన్నాడు.

# మూడో సినిమాతో వస్తున్న రోషన్ కనకాల- ఈసారి సైన్స్ ఫిక్షన్‌తో ప్రయోగం!

రాజీవ్ కనకాల, సుమ దంపతుల కుమారుడు రోషన్ కనకాల తన మూడో సినిమాను అధికారికంగా ప్రారంభించాడు. 'బబుల్‌గమ్', 'మోగ్లి' చిత్రాలతో హీరోగా పరిచయమైనా, ఆ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో, తన కెరీర్‌కు కీలకమైన మూడో సినిమా కోసం రోషన్ ఒక వినూత్నమైన సైన్స్ ఫిక్షన్ కథను ఎంచుకున్నాడు. ఈ చిత్రానికి ప్రయోగాత్మక సినిమాలకు పేరుగాంచిన దర్శకుడు విఐ ఆనంద్ కథ అందించడంతో పాటు సమర్పకుడిగా కూడా వ్యవహరిస్తున్నాడు. విజయ్ కె. కమ్మిశెట్టి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి ఈ చిత్రానికి నిర్మాతలు. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ముఖ్య అతిథిగా హాజరై తొలి క్లాప్ కొట్టాడు. ఈ సినిమాకు 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలకు పనిచేసిన దిగ్గజ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ పనిచేస్తుండటం విశేషం. సైన్స్ ఫిక్షన్, రొమాంటిక్ కామెడీ, ఫాంటసీ అంశాలతో భారీ బడ్జెట్, ఉన్నత సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రోషన్ సరసన గహజీ షిజు కున్నత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సత్య, సుదర్శన్, రవితేజ నన్నిమాల ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ వీఎఫ్ఎక్స్‌తో కూడిన ఈ హై-కాన్సెప్ట్ ఎంటర్‌టైనర్‌తో రోషన్ కమర్షియల్‌గా మంచి బ్రేక్ అందుకుంటాడని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ నెలాఖరు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ ప్రాజెక్ట్‌తోనైనా రోషన్ విజయం సాధిస్తాడేమో చూడాలి.



# ఇంకో కారు కొనడానికి ముద్దు సీన్లలో నటించాలా?

## వ్యక్తిగత విలువలపై సాయి పల్లవి వ్యాఖ్యలు

మలయాళ చిత్రం 'ప్రేమమ్'లో మలర్ పాత్రతో కెరీర్ ప్రారంభించి, శేఖర్ కమ్ముల 'ఫిదా' సినిమాతో టాలీవుడ్‌లో 'లేడీ పవర్ స్టార్'గా గుర్తింపు తెచ్చుకున్న నటి సాయి పల్లవి. సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అగ్ర కథానాయికగా దూసుకుపోతున్నా, గ్లామర్ పాత్రలకు, కమర్షియల్ హంగులకు దూరంగా ఉంటూ తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో సినిమాల్లో ముద్దు సన్నివేశాలు, ఇంటిమేట్ సీన్లపై ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో యాంకర్.. "దర్శకులు ఎప్పుడైనా మిమ్మల్ని ముద్దు సన్నివేశాల్లో నటించమని అడిగారా? అలా చేయకూడదని ఎందుకు నిర్ణయించుకున్నారు?" అని ప్రశ్నించగా, సాయి పల్లవి ఎంతో నిజాయతీగా, కుండబద్దలు కొట్టినట్లు సమాధానమిచ్చారు. "అవును, చాలా మంది దర్శకులు అడిగారు.. ఇప్పటికీ అడుగుతూనే ఉంటారు. నేను ముద్దు సీన్లు చేయనని తెలిసినా అలాంటి ఆఫర్లు వస్తుంటాయి. ఒకవేళ నాకు ఒక జీవిత భాగస్వామి లేదా బాయ్‌ఫ్రెండ్ ఉంటే, కేవలం నటన కోసమే అయినా నేను ఇంకొకరిని ముద్దు పెట్టుకోవడం నాకు సరైందిగా అనిపించదు. ఒక మనిషి సంతోషంగా బతకడానికి ఒక మంచి కుటుంబం, ఉండటానికి ఇల్లు, ప్రయాణించడానికి ఒక కారు ఉంటే చాలు. అవన్నీ భగవంతుడి దయ వల్ల నాకు ఇప్పటికే ఉన్నాయి. కేవలం ఇంకో కారు కొనడానికో, లగ్జరీ జీవితం గడపడానికో నా వ్యక్తిగత విలువలను వదులుకుని ఇంకొకరిని ముద్దు పెట్టుకోవాల్సిన అవసరం నాకు లేదు. నా నటన చూసి మాత్రమే నన్ను సినిమాల్లోకి ఎంపిక చేసుకుంటే చేస్తాను. ఒకవేళ కథకు ముద్దు సీన్లు, ఇంటిమేట్ సన్నివేశాలే ముఖ్యం అనుకుంటే నా స్థానంలో వేరే ఎవరినైనా తీసుకోవచ్చు, అందులో నాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అని స్పష్టం చేశారు. సాయి పల్లవి చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు, ఆమె అభిమానులు సానుకూలంగా స్పందిస్తున్నారు. డబ్బు, స్టార్‌డమ్ కోసం కాకుండా నమ్మిన సిద్ధాంతాలకు, వ్యక్తిగత విలువలకు ప్రాధాన్యత ఇస్తున్న ఆమె వ్యక్తిత్వాన్ని అభినందిస్తూ.. 'దటీజ్ సాయి పల్లవి' అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు.



# అఖిల్ 'లెనిన్'కు సమంత విషెస్

## వైరల్ అవుతున్న పోస్ట్!






అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో నటి సమంత.. అఖిల్‌కు, చిత్ర బృందానికి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలపడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'లెనిన్' ట్రైలర్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్న సమంత, అఖిల్‌ను ట్యాగ్ చేస్తూ ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. "లెనిన్ చిత్ర బృందానికి, అఖిల్‌కు ఆల్ ది వెరీ బెస్ట్. ఇప్పటికే 'పెద్ద బ్లాక్‌బస్టర్ వైబ్స్' కనిపిస్తున్నాయి" అని ఆమె పేర్కొన్నారు. సమంత విషెస్ చెప్పడం ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. కాగా, ఇటీవలే సమంత నటించిన 'మా ఇంటి బంగారం' సినిమాపై అఖిల్ కూడా ప్రశంసలు కురిపించారు. 'లెనిన్' ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఆ సినిమా కాన్సెప్ట్ చాలా ఫ్రెష్‌గా ఉందని, వైబ్ బాగుందని అన్నారు. ఇలా ఒకరి చిత్రాలపై మరొకరు పాజిటివ్‌గా స్పందించుకోవడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మూడేళ్ల విరామం తర్వాత అఖిల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'లెనిన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అంచనాలకు తగ్గట్టే సినిమాకు మంచి స్పందన లభిస్తుండటంతో అక్కినేని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# 'లెనిన్' – మూవీ రివ్యూ!

అఖిల్ హీరోగా చేసిన సినిమానే 'లెనిన్'. సితార నాగవంశీ – నాగార్జున సంయుక్తంగా నిర్మించిన సినిమా ఇది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకి, తమన్ సంగీతాన్ని సమకూర్చాడు. భారీ విజయానికి చేరువకోవడానికి ప్రయత్నిస్తున్న అఖిల్ ను, 'ఏజెంట్' సినిమా కాస్త గట్టిగానే ఇబ్బంది పెట్టింది. దాంతో కాస్త గ్యాప్ తీసుకుని, కథపై ఎక్కువగానే కసరత్తులు చేస్తూ అఖిల్ లైన్లో పెట్టిన సినిమా ఇది. అలాంటి ఈ సినిమా ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. శ్రీ రామాపురంలో 'భారతం మిట్ట' అనే ప్రదేశం ఉంటుంది. మహాభారత కాలంతో ముడిపడిన ఆ ప్రదేశంలో 'ద్రౌపది దేవి' పూజలందుకుంటూ ఉంటుంది. ప్రతి ఏటా ద్రౌపదీదేవికి అక్కడ జాతర నిర్వహిస్తూ ఉంటారు. భర్తను కోల్పోయినప్పటికీ ఆ ఊరిపై జయంతి (ఈశ్వరీరావు) పెత్తనం చేస్తుంటుంది. అనాథగా ఆ ఊళ్లో అడుగుపెట్టిన 'లెనిన్' (అఖిల్)ను ఆమెనే చేరదీస్తుంది. తన కొడుకు వసంత్ (ప్రమోద్)తో పాటు పెంచుతుంది. డాక్టర్ గా పై చదువులు కోసం వసంత్ మద్రాస్ వెళ్లిపోగా, జయంతికి సంబంధించిన పనులను చూసుకుంటూ లెనిన్ అక్కడే ఉండిపోతాడు. ఆ ఊరిపెద్ద మనుషులలో ఒకరుగా నీలకంఠం (రాంకీ) చెలామణి అవుతుంటాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు ఒకరు 'వైదేహి' అయితే .. మరొకరు 'భారతి' ( భాగ్యశ్రీ బోర్సే). పట్నంలో బంధువుల దగ్గరే ఉంటూ చదువుకున్న భారతీ, తన సొంత ఊరుకు చేరుకుంటుంది. ఆమెను చూడగానే లెనిన్ మనసు పారేసుకుంటాడు. ఇక డాక్టర్ చదువును పూర్తి చేసుకుని ఆ ఊరికి తిరిగొచ్చిన 'వసంత్'ను వైదేహి ప్రేమిస్తుంటుంది. దాంతో వాళ్లిద్దరికీ పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించుకుంటారు. ఆ గ్రామంపై పట్టు కోసం ఎమ్మెల్యే రాఘవరెడ్డి ప్రయత్నిస్తుంటాడు. తనని ఎంతమాత్రం లెక్కచేయని లెనిన్ – వసంత్ ల సంగతి చూడాలనే కోపంతో ఆయన ఉంటాడు. ఇక 'భారతం మిట్ట'పై పెత్తనం కోసం 'యతిరాజు' (శివాజీ) ఎదురుచూస్తుంటాడు. ఈ విషయంలో తనకి అడ్డుపడుతున్న జయంతిపై ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంటాడు. ఇక లెనిన్ పై మనసు పడిన భారతిని వశపరచుకోవాలనే ఉద్దేశంతో 'తులసి' (శత్రు) ఉంటాడు. ఈ నేపథ్యంలోనే వసంత్ ను పెళ్లి చేసుకోవలసిన వైదేహి కనిపించకుండా పోతుంది. దాంతో అదే ముహూర్తానికి తన చిన్న కూతురైన భారతిని వసంత్ కి ఇచ్చి పెళ్లి చేయాలని నీలకంఠం నిర్ణయించుకుంటాడు. అప్పుడు భారతి ఏం చేస్తుంది? లెనిన్ తో ఆమె వివాహం జరుగుతుందా? ఆమె అక్కయ్య వైదేహి ఏమైపోతుంది? రాఘవరెడ్డి .. యతిరాజు .. తులసితో పాటు లెనిన్ ఎదుర్కోవలసిన మెయిన్ విలన్ ఎవరు? అనేది మిగతా కథ. శ్రీ రామాపురం అనే ఊరు 'లెనిన్' అనే యువకుడిని పెంచి పెద్ద చేస్తుంది. అందువలన తనను చేరదీసి కుటుంబానికి .. తనకి నీడనిచ్చిన ఊరుకి అతను ఎంతో నమ్మకంగా ఉంటూ ఉంటాడు. అలాంటి అతను భారతి ప్రేమలో పడతాడు. అయితే ఆ ప్రేమను పెళ్లి పీటలవరకూ తీసుకుని వెళ్లడానికి అతను కొంతమంది శత్రువులను ఎదుర్కోవలసి వస్తుంది. వాళ్లు ఎవరూ? వాళ్లతో అతనికి గల శత్రుత్వం ఏమిటి? అనేది ప్రధానమైన కథ. 1970 – 2000 కి మధ్య జరిగే ఈ కథలో అనేక కోణాలు కనిపిస్తాయి. ఆహ్లాదకరమైన గ్రామంలో అందమైన ప్రేమజంట. ఆ గ్రామంపై పట్టు కోసం ఎదురుచూసే ఒక రాజకీయ నాయకుడు, అక్కడ జాతర తన చేతుల మీదుగా జరగాలనే అధికార దాహంతో ఒకరు .. ఆ ప్రేమజంటను విడదీయాలనే ఆలోచనలో మరొకరు. నమ్మిస్తూ నమ్మక ద్రోహానికి సిద్ధమవుతున్నదొకరు. ఇలా వివిధ కోణాల నుంచి అల్లుకున్న ఈ కథను ఆసక్తికరంగా ఆవిష్కరించడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేశాడు. ఇక దర్శకుడు 'ద్రౌపది' జాతరను ప్రధానంగా చేసుకుని, మహాభారతంలోని పాత్రలతో ముడిపెడుతూ ఈ కథను నడిపించాడు. ఫస్టు పార్టులో ఫస్టు ట్విస్ట్ ను ఇంటర్వెల్ కి ముందు పేల్చిన దర్శకుడు, అక్కడి నుంచి కథను మరింత వేడెక్కిస్తాడు. ఇక సెకండాఫ్ కూడా మరో ఒకటి రెండు ట్విస్టులతో వేగాన్ని పుంజుకుంటుంది. ద్వేషం .. ప్రతీకారం .. నమ్మకద్రోహంతో కూడిన సన్నివేశాలతో నడుస్తుంది.




Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449